# పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

○ జిల్లా ఎన్నికల అధికారి పి.ఉదయ్‌కుమార్ ○ ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరిన సిబ్బంది



పోలింగ్ సామగ్రి పంపిణీని పర్యవేక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్



అమ్రాబాద్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి సామాగ్రితో చేరుకున్న సిబ్బంది

అచ్చంపేట టౌన్/అమ్రాబాద్/ లింగాల, నవంబర్ 29: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి పి.ఉదయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించే విధంగా పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారని అన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అన్ని మెటీరియల్, ఈవీఎంలు తీసుకొని భద్రతా దళాల కట్టుదిట్టమైన భద్రతా మధ్య రూట్‌ల వారీగా పంపిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఎన్నికల నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. బుధవారం సాయంత్రం వరకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకొని అక్కడ రేపటి ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకొని ఉదయాన్నే 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించి, అన్ని క్లియర్ చేసిన అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభించి పారదర్శకంగా ముగించాలని సూచించారు. అచ్చంపేట నియోజకవర్గంలో 199 పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని, 145 సమస్యాత్మక కేంద్రలుగా గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపిరామ్, డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐలు అనుదీప్, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది**

నేడు జరగనున్న తెలంగాణ శాసనసభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం ఎన్నికల సిబ్బంది ఓటింగ్ సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో మొత్తం 49 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పీఓ, ఏపీవోలతో ప్రతి కేంద్రానికి ముగ్గురు చొప్పున మొత్తం 250 మంది సిబ్బంది పాల్గొననున్నట్లు అమ్రాబాద్ తాసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశామని, ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు విధిగా తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలతో గట్టి భద్రతతో పాటు సీసీ కేంద్రాలను ఏర్పాటు చేసి, నిఘా ఉంచామని సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

**కేంద్రాలకు ప్రత్యేక భద్రత**

లింగాల, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం నిర్వహించే పోలింగ్ బుధవారం మండలంలోని ఆయా కేంద్రాలకు ప్రత్యేక భద్రత మధ్య ఈవీఎం బాక్సులు చేరాయి. మండలంలో మొత్తం 30,063 మంది ఓటర్లు ఉండగా, అదనంగా కొత్తగా మరో 360మంది ఓటర్లను చేర్చినట్లు తెలిపారు. అలాగే మండలంలో 34పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. చెంచు గిరిజనులను దృష్టిలో ఉంచుకొని ఆయా పెంటల్లో మరో 9పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 45కేంద్రాలకు ప్రత్యేక బలగాల నడుమ ఈవీఎం బాక్సులు చేరినట్లు ఎన్నికల సెక్టార్ అధికారిణి ఎంపీడీవో గీతాంజలి తెలిపారు.

**వంగూరు మండలంలో..**

వంగూరు, నవంబర్ 29: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల సెక్టార్ అధికారి శంకర్‌నాయక్ బుధవారం తెలిపారు. మండలంలో మొత్తం 36 పోలింగ్ కేంద్రాలుండగా వాటిని 3 రూట్లుగా విభజించారు. మూడు రూట్లకు ఎంపీడీవో విజయభాస్కర్, ఎంఈఓ శంకర్‌నాయక్, పీఆర్ ఏఈ మణిపాల్‌నాయక్‌ను సెక్టార్ అధికారులుగా ఎన్నికల సంఘం నియమించింది. పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతితో పాటు విద్యుత్, వైద్యం, సిబ్బందికి భోజన వసతి కల్పించినట్లు శంకర్‌నాయక్ పేర్కొన్నారు.

***ఎన్నికల బందోబస్తు కోసం..***

ఎన్నిలక సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 85మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. వారిలో 25 మంది కేంద్ర బలగాలు, 33 మంది కర్ణాటక పోలీసులు కాగా మరో 30 మంది స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. వీరు సీఐ, ఎస్సై పర్యవేక్షణలో పని చేస్తారన్నారు.



బల్మూరు: అనంతవరంలో కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



వంగూరు మండలం కోనేటిపూర్‌లో పోలింగ్ కేంద్రానికి వస్తున్న ఎన్నికల సిబ్బంది



వంగూరు: పోలీసులకు సీఐతో కలిసి సూచనలిస్తున్న ఎస్సై కురుమూర్తి









నాగర్‌కర్నూల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు సామాగ్రితో వెళ్తున్న సిబ్బంది

## ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి

కడ్తాల్, నవంబర్ 29: ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగా మహిళ మృతి చెందిన సంఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించి సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పెద్దవేములోనిబావి తండాకి చెందిన రమావత్ రాజునాయక్, భార్య సునీత (28)తో కలిసి, బుధవారం ఉదయం వరి ధాన్యం నూర్పిడి కోసం మండల కేంద్రం సమీపంలో గల ఓ రైస్ మిల్లుకి వచ్చింది. రైస్ మిల్లు ఆవరణలోని ఓ ట్రాక్టర్ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్ స్నిగల్ వేయకుండా, అజాగ్రత్తగా ట్రాక్టర్‌ని రివర్స్ తీసే క్రమంలో సునీతను ఢీకొట్టాడు. సునీతకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు సమాచారమందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద వివరాలు సేకరించారు. మృతురాలు పెద్దవేములోని బావి తండాలో మహిళ సమాఖ్య గ్రూపులకు వీవోఏగా విధులు నిర్వహిస్తున్నది. మృతురాలికి కుమార్తె అంజలి, కుమారుడు రాంచరణ్ ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.




కల్వకుర్తిలోని పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రం



వెల్దండలో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన 151వ మోడల్ పోలింగ్ కేంద్రం

## పంపకాల్లో లుకలుకలు

◆ ఓటమి భయతో పంపకాలకు తెరలేపిన కాంగ్రెస్ ◆ కీలక నేతల మధ్య మాటల యుద్ధం ◆ అయోమయంలో కార్యకర్తలు

గద్వాలటౌన్, నవంబర్ 29 : ఓటమి భయంతో కాంగ్రెస్ ఓటును నోటుతో కొనేందుకు పూనుకుంది... దీంతో గత రెండు రోజుల నుంచే పంపకాలు చేపట్టింది. ఓటుకు వెయ్యి, రెండు వేలు.. మూడువేలు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇక్కడే ఆ పార్టీ కీలకనేతల మధ్య పొసక లేదు. దీంతో ఒకరు వెయ్యి ఇవ్వాలనగా మరొకరు రెండు వేలు ఇవ్వాల్సిందే లేకుంటే ఓడిపోవడం ఖాయం.. మీరు మీ రాజకీయం చేత కాకపోతే రాజకీయం చేయరాదు అంటూ ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగింది. ఒకరినొకరు తోపుకునే స్థాయికి చేరుకుంది. ఈ ఘటన ఆ నోట ఈ నోట పడి ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. దీంతో కీలక నేతలుగా వ్యవహరిస్తూ అన్ని తామై ముందుండి నడిపే నాయకులే ఇలా ఉంటే సామాన్య కార్యకర్తలమైన మనం, వార్డుల్లో మండలాల్లో ఏమి సమాధానం చెప్పుకోవాలి అంటూ ఏ ఇద్దరు కార్యకర్తలు కలిసినా ఇదే చర్చించుకుంటున్నారు. మొన్న మన అభ్యర్థి మాట్లాడిన అహంకారమైన మాటలు ఇప్పుడే కొంపముంచేటట్లు ఉంటే.. ఇప్పుడు ఈ నాయకులు ఇలా వ్యవహరించడం ఏమి, సొంత పార్టీలో ఉన్న ఇంత విలువ ఉండేదేమో ఊక గాన వచ్చి ఉన్న విలువ పోగొట్టుకున్నట్లు ఉంది అంటూ ఆవేదన వ్యక్తం చేయడం కార్యకర్తల పనైంది.